
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 27 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.90 (308.7614)	28,253	46,229
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.29)	4,852.39	4,640.97
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	42,689	36,957

చికెన్ ధరలు | లైవ్: రూ.138 | డ్రెస్: రూ.200 | స్కిన్‌లెస్: రూ.228

సాగునీటి వనరుల పెంపునకు సన్నాహాలు

- తక్కువ వ్యయంతో చిన్న నీటివనరుల పూర్తికి ప్రభుత్వం ఆలోచన
- ప్రభుత్వ హామీతో ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యేల సమాలోచనలు
- మూసీ పరివాహక ప్రాంతంలో చిన్నకాల్వల ఆధునికీకరణ
- అలీనగర్, బొల్లెపల్లి, భీమలింగం కత్వలపై దృష్టి
- బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ



బునాదిగాని కాల్వ

చిన్ననీటి పథకాల కింద సాగు భూమిని పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అధిక వ్యయంతో కూడిన సాగునీటి పథకాలు కాకుండా, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెంచేందుకు స్థానిక ఎమ్మెల్యేలు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు సాగునీటి పారుదలను మెరుగుపరిచేందుకు ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమాలోచనలు చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వల సామర్థ్యం పెంపు, పునరుద్ధరణ అనంతరం ఏ మేరకు సాగునీటిని అందించవచ్చన్న అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

జిల్లాతోపాటు, నల్లగొండ జిల్లాలోని పలు మండలాలకు బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల ద్వారా సాగునీరు అందుతోంది. ఈ కాల్వల పునరుద్ధరణకు ఇరిగేషన్‌శాఖ అంచనాలు రూపొందిస్తోంది. ఈ కాల్వల పునరుద్ధరణకు సుమారు రూ.450కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా. ఈ కాల్వలను పునరుద్ధరించడంతో పాటు దీని పరిధిలోని చెరువులను నింపేందుకు ప్రస్తుతం ఉన్న చిన్నకాల్వల (డిస్ట్రిబ్యూటరీల) విస్తీర్ణాన్ని పెంచేందుకు అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. చిన్న కాల్వలను ఆధునీకరిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

మంత్రి సమీక్షతో ముందడుగు

భారీనీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల భువనగిరిలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చిన్ననీటి పారుదల కింద ప్రభుత్వం నిధులిచ్చేందుకు సిద్ధంగా ఉందని, గతంలో రూపొందించిన ప్రతిపాదనలతో సంబంధం లేకుండా తాజాగా సాగునీటి కాల్వల పునరుద్ధరణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ అంచనాలు రూపొందిస్తున్నారు. అంతేగాక, వీటికి అనుబంధంగా ఉన్న చిన్న కాల్వల విస్తీర్ణాన్ని పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా మూసీ పరిధిలోని చిన్న కాల్వలపైనా అధికారులు దృష్టిసారించి కార్యాచర రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

అలీనగర్, బొల్లెపల్లి, భీమలింగం కాల్వల వెడల్పు

మూసీ పరివాహక ప్రాంతంలోని బునాదికాల్వకు అనుసంధానంగా ఉన్న అలీనగర్, బొల్లెపల్లి, భీమలింగం కత్వ ద్వారా పలు చెరువుల్లోకి నీరు వెళ్తుంది. ఈ కాల్వల విస్తీర్ణం చిన్నదిగా ఉండటంతో పాటు కాల్వల్లో గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో మూసుకుపోయాయి. వీటిని పునరుద్ధరిస్తే చెరువుల్లోకి నీరు చేరి సాగు విస్తర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. అంతేగాక బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి ప్రధాన కాల్వల పునరుద్ధరణతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న చిన్న కాల్వల వెడల్పు చేయాలన్న ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ఈ కాల్వలకు సరైన డిజైన్ రూపొందించలేదని, ఏడు అడుగుల కాల్వకు ఒక మీటరు పైపు లైన్ వేయడంతో నీరు సరిగా రావడంలేదని ఎమ్మెల్యేలు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో చిన్న కాల్వల పునరుద్ధరణకు అవసరమయ్యే నిధులకు అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. గతంలో రూపొందించిన అంచనాల ప్రకారం వీటిని పునరుద్ధరిస్తే జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాల్లోని ఏడు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అలీనగర్, బొల్లెపల్లి, బీమలింగం కత్వల వెడల్పు చేస్తే మూసీ పరివాహక ప్రాంతంలోని ఒక్క భువనగిరి నియోజకవర్గంలో 15వేల ఎకరాల వరకు అదనంగా సాగు నీరు అందుతుంది. ఒక్కో కాల్వ ఆధునికీకరణకు రూ.10కోట్లు, మూడు కాల్వలకు మొత్తంగా రూ.30కోట్ల మేరకు వ్యయం కానున్నట్లు అంచనా. కాల్వ 51 కిలోమీటర్ల పొడవు ఉండగా, దీనిపై 102 కల్వర్టులు నిర్మించాలి. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీలు, కాల్వల ద్వారా 46 చెరువులు నిండనున్నాయి. అధికారుల ప్రతిపాదనల అనంతరం ఎమ్మెల్యేలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు సన్నద్ధమవుతున్నారు.

పునరుద్ధరణకు రైతులు సై

బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల రీడిజైన్, లైనింగ్ స్ట్రక్చర్ చేస్తే అదనంగా ఆయకట్టు సాగులోకి వస్తుందని ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యేలతోపాటు రైతులు విజ్ఞప్తి చేశారు. కాల్వల వెడల్పు 15 అడుగులకు పెంచేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించడం ప్రభుత్వానికి సవాల్‌గా ఉండనుంది. స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి భూసేకరణ చేసిన పక్షంలో, ఎన్ని నిధులైన ఇస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో చర్చించగా భూములిచ్చేందుకు సహకరిస్తామని ముందుకు వచ్చినట్టు తెలిసింది. బునాదిగాని కాల్వకు గతంలో 200ఎకరాల వరకు భూసేకరణ అధికారులు సిద్ధం కాగా, కాల్వలను వెడల్పు చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో సుమారు 350ఎకరాలకు పైగా సేకరించనున్నారు. ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలకు 250 ఎకరాల చొప్పున భూసేకరణ చేసే అవకాశం ఉంది. ఆ తరువాతే పునరుద్ధరణ పనులు సాగనున్నాయి.



సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు సన్నాహాలు

భువనగిరి నియోజకవర్గంలోని బునాదిగాని కాల్వకు అనుసంధానంగా ఉన్న అలీనగర్, బీమలింగం కత్వ, బొల్లేపల్లి కాల్వలను ఆధునీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. బునాదిగాని కాల్వకు అనుసంధానంగా ఉన్న చిన్న కాల్వల వెడల్పుతో పాటు, ఓపెన్ కల్వర్టులు నిర్మించాలి. తద్వారా చెరువుల్లోకి నీరు చేరుతుంది. ఈ మేరకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించిన పక్షంలో అదనంగా 15వేల సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

● కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

స్ఫూర్తిని నింపిన వీరవనిత ఐలమ్మ

అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 26: సామాజికంగా దిగువన ఉన్న జనానికి స్ఫూర్తిని ఇవ్వడమేగాక భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిని చాకలి ఐలమ్మ వీర వనితగా చరిత్ర సృష్టించిందని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. గురువారం ఐలమ్మ జయంతిని సందర్భంగా సాగర్ రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళ్ళించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రజాకారులపై ఉద్యమించిన ఐలమ్మ ఎందరికో ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఐలమ్మ రజక కుటుంబంలో జన్మించి వీరవనితగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రమేష్, బీసీ సంక్షేమసంఘం అధ్యక్షులు చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, రజక సంఘం అధ్యక్షుడు చిక్కుళ్ల రాములు, అంజయ్య, కొండూరు సత్యనారాయణ, లకడాపురం వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి వి.రమేష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి అవసరమయ్యే వార్తలు ఇవ్వాలి




పీఐబీ నిర్వహించిన వార్తాలాప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 26: సంచలనాలకు బదులు సమాజానికి అవసరమయ్యే వార్తలకు ప్రాధాన్యం ఇస్తే సమాజ మార్పునకు నాంది పలకవచ్చని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన 'వార్తాలాప్' వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నవీకరించుకుంటూ, సమాజంలో మీడియా పాత్రను సమర్థంగా నిర్వహించాలన్నారు. వార్తలు రాసేప్పుడు నిజనిర్ధారణ చేసుకొని ఇస్తే బాగుంటుందన్నారు. పీఐబీ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) లాంటి కేంద్ర సంస్థ జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోషణమాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అందరూ తిలకించి అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ క్రైం డిప్యూటీ ఎస్పీ టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరాల్లో నేరస్థులు ఎక్కడో ఉండి చేయాల్సిన నష్టం చేస్తున్నారని, నిత్యం ఎంతో మంది సైబర్ మోసాల బారిన పడి నష్టపోతున్నారని అన్నారు. బాధితుల్లో ఉన్నత విద్యావంతులే 90శాతానికి పైగా ఉన్నారన్నారు. సైబర్ నేరాలు జరిగిన గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడవచ్చన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస కృష్ణకాంత్ మాట్లాడుతూ, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలోని పత్రికా సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తోందన్నారు. జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ, కచ్చితమైన వార్తలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాట్ సైంటిస్ట్ జగదీష్‌బాబు, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వరరావు, గాయత్రి, శివచరణ్‌రెడ్డి, డీపీఆర్‌వో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కులగణన సాధ్యం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మర్రిగూడ, సెప్టెంబరు 26: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీ కులగణన సాధ్యమవుతుందని, వారం రోజుల్లో అందుకు మార్గదర్శకాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాయన మాట్లాడుతూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల కులగణన చేయకుండా, రిజర్వేషన్ల శాతం పెంచకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అదేవిధంగా కేంద్రంలో ఉన్న బీసీ ప్రధానమంత్రి మోదీ కూడా బీసీ రిజర్వేషన్, కులగణన చేయకపోవడం బాధకరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లో కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలకూర కిరణ్, నక్క శ్రీనివాస్, వెంకటంపేట బాలయ్య, జాజుల భాస్కర్, పగిళ్ల సత్యనారాయణ, అయితగోని ఆంజనేయులు, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత సొసైటీ అప్పుతో ఉక్కిరిబిక్కిరి



మాంద్రలోని చేనేత సొసైటీ పాత భవనం

- మాంద్ర సొసైటీ రూ.13లక్షలు బకాయి
- జప్తు నోటీసు జారీ చేసిన నల్లగొండ సహకార బ్యాంకు
- నిరుపయోగంగా సొసైటీ భవనాలు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 26: నార్కట్‌పల్లి మండలంలోని మాంద్ర చేనేత సొసైటీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. చేనేత కార్మికులు వస్త్రాల తయారీ కోసం నల్లగొండలోని సహకార బ్యాంకులో తెచ్చిన క్యాష్ క్రెడిట్ (నగదు పరపతి)కు సంబంధించిన అప్పు తీర్చే మార్గం లేక సొసైటీ చేతులెత్తేసింది. దీంతో అప్పు వసూలు చేసుకునేందుకు సదరు బ్యాంకు సొసైటీ భవనం జప్తునకు నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉంటే సొసైటీ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ మృతి చెందడం, ప్రభుత్వం చేనేత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో మాంద్ర సొసైటీ కార్యకలాపాలు నిలిచాయి. ఫలితంగా సొసైటీ భవనం నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారింది. చేనేత కార్మికుల ఉపాధికి వేదికగా ఉండాల్సిన సొసైటీ భవనం అసాంఘిక కార్యకాలాపాలకు అడ్డాగా మారుతోంది. సుమారు రూ.40లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ భవనం ఆవరణలో పిచ్చిచెట్లు మొలిచాయి.

సొసైటీలో 156 మంది సభ్యులు

మాంద్ర చేనేత సహకార సంఘంలో సుమారు 156 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉండేవారు. వీరిలో 10 మందితో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకుని, అందులో ఒకరిని సొసైటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆప్కో సంస్థ ఇచ్చిన ఆర్డర్లతో వస్త్రాలు నేసి సొసైటీ ద్వారా ప్రభుత్వానికి విక్రయించి కార్మికులు ఉపాధి పొందేవారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో టెస్కో నుంచి ఆర్డర్లు లేక కార్మికులకు ఉపాధి తగ్గింది. నాలుగేళ్ల కిందట సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ మృతిచెందగా, బాధ్యతలు చేపట్టేందుకు డైరెక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. ప్రభుత్వం సొసైటీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్యకలాపాలు సైతం నిలిచాయి.

నిరుపయోగంగా భవనాలు

మాంద్ర చేనేత సొసైటీ సభ్యుల కోసం రెండు దఫాలుగా నిర్మించిన భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. చేనేత కార్మికుల శిక్షణ, మౌలిక సదుపాయాల పథకం కింద రెండు విడతల్లో ఇక్కడ భవనాలు నిర్మించారు. టీడీపీ హయాంలో మాధవరెడ్డి మంత్రిగా కొనసాగిన సమయంలో సుమారు రూ.12లక్షలతో షెడ్డును నిర్మించారు. అనంతరం బీఆర్‌ఎస్ హయాంలో వేముల వీరేశం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.33.90లక్షల అంచనా వ్యయంతో కామన్ వర్క్‌షెడ్ కం డైహౌస్ భవనాన్ని రెండంతస్తులుగా నిర్మించారు. ప్రస్తుతం ఈ రెండు భవనాలూ నిరుపయోగంగా మారాయి. అడపాదడపా గ్రామంలో శుభకార్యాలు వీటిని వినియోగిస్తున్నారు. కాగా, పాతభవనంలో ఉన్న 10 చేనేత మగ్గాలు అక్కడే మగ్గుతున్నాయి.

సొసైటీ డైరెక్టర్లకూ నోటీసులు

కార్మికులు చేనేత వస్త్రాలు నేసేందుకు అవసరమైన మగ్గాలు, ముడిసరుకు కొనుగోలుకు సొసైటీ పేరున క్యాష్ క్రెడిట్ కింద గత చైర్మన్ నల్లగొండలోని సహకార బ్యాంకు నుంచి సుమారు రూ.7లక్షల మేర అప్పు తెచ్చారు. చైర్మన్ మృతిచెందకముందే అప్పు తీర్చాలని బ్యాంకు అధికారులు ఆయనతోపాటు తొమ్మిది మంది డైరెక్టర్లకు నోటీసులు పంపారు. అయితే అప్పు తెచ్చిన విషయమే తెలియక నోటీసులు అందుకున్న డైరెక్టర్లు ఆందోళన పడ్డారు. అప్పుకు సంబంధించిన నోటీసులపై అప్పట్లోనే చైర్మన్‌ను ప్రశ్నించగా ఆ అప్పును తానే తీరుస్తానని హామీ ఇచ్చారు. ఆయన మృతిచెందడంతో పాటు ఏడాది కాలంలోనే వైస్ చైర్మన్ కూడా మృతిచెందారు. దీంతో సొసైటీ బాధ్యతలు చూసేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడానికి తోడు సొసైటీలను ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం చేనేత, జౌళిశాఖ ఏడీ ఇక్కడ ఇన్‌చార్జిగా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

● **అప్పు తీర్చకుంటే జప్తు చేస్తాం**

మాంద్ర చేనేత సొసైటీ చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు మాకున్న ఏకైక మార్గం సొసైటీ ఆస్తుల జప్తు ఒక్కటే. సొసైటీ అప్పుకు సంబంధించి ఇప్పటికే సంబంధిత అధికారులను సంప్రదించాం. వారు కూడా నిస్సహాయత వ్యక్తం చేశారు. దీంతో జప్తు నోటీసు ఇచ్చాం. అయినా అప్పు తీర్చకుంటే జప్తు చేస్తాం.

- భాగ్యశ్రీ, నల్లగొండ సహకార బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్

అప్పు వసూలుకు జప్తు నోటీసులు

సొసైటీ కార్మికుల కోసం క్యాష్ క్రెడిట్ కింద తీసుకున్న అప్పు మొత్తం ఈ ఆర్థిక సంవత్సరానికి వడ్డీతో కలిసి సుమారు రూ.13లక్షలకు చేరింది. అప్పు తీర్చాల్సిన సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ మృతిచెందడం, డైరెక్టర్లు చేతులెత్తేసిన పరిస్థితుల్లో విషయాన్ని సొసైటీ ఇన్‌చార్జ్‌గా ఉన్న చేనేత, జౌళిశాఖ ఏడీ దృష్టికి బ్యాంకు అధికారులు తీసుకెళ్లారు. తానేం చేయలేనని, మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని ఆయన సమాధానమివ్వడంతో చేసేది లేక సొసైటీ భవనం జప్తునకు బ్యాంకు అధికారులు నోటీసులను జారీ చేశారు.

● **ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం**



మాంద్ర చేనేత సొసైటీ భవనాన్ని సహకార బ్యాంకు అధికారులు జప్తు చేయకుండా చేనేత, జౌళిశాఖ అధికారులు చొరవ చూపాలి. సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ మృతి చెందడం, సొసైటీల రద్దుతో చేనేత మగ్గాలపై వస్త్రాల తయారీ కార్యకలాపాలు నిలిచాయి. ఈ క్రమంలో అప్పు తీర్చలేని పరిస్థితిని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాఫీ అయ్యేలా ప్రయత్నం చేయాలి. మేం కూడా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి భవనం జప్తు కాకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- దొండ రమేశ్, మాంద్ర

రాష్ట్రంలో గాడితప్పిన విద్యారంగం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల దీక్షలో మాట్లాడుతున్న నాగరాజు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 26: రాష్ట్రంలో విద్యారంగం గాడితప్పిందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 'విద్యార్థి పోరు దీక్ష'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచేంత వరకు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ సరైన మార్గంలో నడవకుంటే మిగతా శాఖల పనితీరు ఎలా ఉండోనని విమర్శించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన మెనూ మాత్రమే అందిస్తున్నారన్నారు. ఖైదీలకు రూ.87తో భోజనం అందిస్తుండగా, భావిభారత పౌరులైన విద్యార్థులకు రూ.33తో మూడు పూటలా భోజనం ఎలా సాధ్యమో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని, ఎంజీ యూనివర్సిటీకి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలో వసతి గృహాలకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేల్కొల్పేందుకు ఈ నెల 27న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ ఎదుట నిర్వహించనున్న విద్యార్థి మహాగర్జనను విద్యార్థులు విజయవంతం చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కుంచం కావ్య, స్పందన, కుర్ర సైదా నాయక్, ముస్కు రవిందర్, చందు, నవీన్, వీరన్న నాయక్, పుట్ట సంపత్, నవదీప్, తరుణ్, కిరణ్, మున్నా, సాయి, తదితరులు పాల్గొన్నారు.

అల్యూమినియం ఫ్యాక్టరీని తొలగించాలి

ఎమ్మెల్యేను అడ్డుకున్న కుర్మేడ్ గ్రామస్థులు



కుర్మేడ్‌లో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

చింతపల్లి, సెప్టెంబరు 26: అల్యూమినియం తయారుచేసే ఫ్యాక్టరీ వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌ను గ్రామస్థులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని కుర్మేడ్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. చింతపల్లి మండలంలోని కుర్మేడ్ జడ్పీహెచ్‌ఎస్‌లో డివిజన్ స్థాయి ఆటలపోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరయ్యారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో వెళ్తున్న క్రమంలో కుర్మేడ్ గ్రామస్థులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. చింతపల్లి మండలంలోని కుర్మేడ్ గ్రామశివారులో అల్యూమినియం తయారు చేసే ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారని, అక్కడినుంచి దుమ్ముతో కూడిన పొగ, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఫ్యాక్టరీని వెంటనే మూసి వేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ త్వరలో ఫ్యాక్టరీని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇవ్వటంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

అమ్మ కావాలి.. అమ్మ రావాలి

- తల్లి కోసం తల్లడిల్లిన చిన్నారులు
- కాల్వలో గల్లంతైన శైలజ మృతదేహం లభ్యం

7లో...

పర్యాటక కల ఫలించేనా?

- ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలెన్నో..

నిండా మునిగిన రైతులు

● ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, మిర్చి పంటలకు నష్టం ● మేళ్లచెర్వు మండలంలో 17 వేల ఎకరాల్లో సాగు



ఎండిపోయిన పత్తి చేను

మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నల్ల రేగడి నేలల్లో సాగు చేసిన పత్తి, మిర్చి రైతులు నష్టపోయారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలవ్యాప్తంగా 15వేల ఎకరాల్లో పత్తి, రెండు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మొత్తం నల్లరేగడి భూమి కావడంతో వర్షాలకు అధిక మొత్తంలో నీరు నిలిచి భూమిలోకి ఇంకిపోవడంతో పాటుగా వర్షపు నీరు పొలాల్లో నిల్వ ఉండటంతో మిట్టపంట అయిన పత్తి పంట నీరు నిలిచి ఉన్న చోట పండుబారి ఎండిపోగా తేమ ఉన్న పొలాల్లో పూత, పిందె రాలి వట్టి ఆకులు, కొమ్మలు మాత్రమే మిగిలాయి. సాధారణంగా పత్తిపంట రసం పీల్చే పురుగుల భారీ నుంచి కాపాడుకునేందుకు బీ టీ రకం పత్తి విత్తనాలను విత్తుతారు. కాగా పత్తి మొక్కపై బీటీ ప్రభావం వంద నుంచి 120రోజులు వరకు ఉంటుంది. పత్తి మొక్క విత్తిన 45రోజుల్లో గూడ, పూత, పిందె, దశకు చేరుకొని వంద రోజుల్లో దాదాపు 80శాతం పంట రావాల్సి ఉండడం సాధారణంగా జరిగే ప్రక్రియ. కాగా ఈ సీజన్లో సకాలంలో వర్షాలు కురవడంతో జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు నాటడంతో సెప్టెంబరు చివరి వారానికి పత్తి విత్తి వంద రోజులు పూర్తి అయింది. దీంతో పత్తిలో కీటకాలను ఎదుర్కొని బీటీ శక్తి నశించిపోయింది. కాగా ప్రస్తుత పరిస్థితిలో పూర్తిగా కాసి వుండాల్సిన చేన్లు అధిక వర్షాలకు పూత, కాయలు రాలి వట్టి చెట్లుగా నిలిచాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో నష్టం జరిగింది. అధికారులు మాత్రం నామామాత్రపు తనిఖీలు నిర్వహించి మండలవ్యాప్తంగా కేవలం 170 ఎకరాలు మాత్రమే నష్టపోయిందని పూర్తిగా ఎండిపోయిన పంట పొలాలో కొన్నింటిని మాత్రమే ఎంపిక చేయడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతు న్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

ఎదగని మిర్చి పంట

మండల వ్యాప్తంగా ఇటీవల కురిసన వర్షాలకు మిర్చి పంట ఎదుగుదల లేకుండా పోయింది. సెప్టెంబరు చివరి వారంలో పూర్తిగా ఎదిగి పూత దశలో ఉండాల్సిన మిర్చి నాటిన రోజు ఉన్నట్లుగానే ఒక్క పుల్లతోనే జీవచ్ఛవంలో ఉంది. వేలకు వేలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్ల, పురుగుల ఉధృతికి గతంతో పోల్చితే పంట విస్తీర్ణం మండల వ్యాప్తంగా తగ్గిపోగా అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మిర్చి ఎదిగే పూత, పిందె వచ్చే సమయానికి నల్లి, ముడత, పేనుబంక తెగుళ్ల వచ్చి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, జనవరికి ముందుగానే పంట వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

పూత, కాయలు రాలిపోయాయి

గత సంవత్సరం కాలం కానప్పుడే రైతుల పరిస్థితి బాగుండేది. ఆరు ఎకరాల పత్తి మూడు ఎకరాల మిర్చి వేశా. పత్తి ఎకరానికి రూ.35 వేలు, మిర్చి ఎకరానికి రూ.50 వేలు, సెప్టెంబరు మొదటి వారానికి ముందే పెట్టా. కౌలు కాక రూ.3 లక్షల 50 వేల పెట్టుబడి అప్పు తెచ్చి పెట్టా. ఇప్పుడు పత్తిచెట్లు పూర్తిగా పూతలు, కాయలు రాలిపోయాయి మిర్చి ఎండిపోయే దశలో ఉందని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిశీలనకు రాలేదు.

● పత్తి రైతు సుంకరి హనుమంతు, మేళ్లచెర్వు.

నిండామునిగిపోయాం

అప్పు తెచ్చి కౌలుకు నాలుగు ఎకరాలు పత్తి వేశామని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లిందని వట్టి చెట్లే మిగిలాయి. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో అట్టి పత్తి చేళ్లకు మళ్లీ మొదట నుంచి మందులు వాడిన ప్రయోజనం ఉండదని ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం సరైన సలహాలు, సూచనలు చేసి అయినా రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేయాలి.

● అప్పిరెడ్డి, రైతు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



అలంకారమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాల నైరుతి దిశలో ప్రాకార మండపంలో ఉత్తవ మూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభర ణాలు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపం లో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహిం చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాల యంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహ వనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ.7,25,882ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం 588.90 అడుగులు



నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రం 588.90 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 588.90 అడుగులు (308.7614టీఎంసీలు)గా ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 28,253 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతుండగా, సాగర్ నుంచి 46,229 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో..

ఎగువ మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఐదారు రోజులుగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది. ఎగువ నుంచి పెరుగుతున్న వరద మేరకు ప్రాజెక్టు 2, 3, 7 నెంబర్ క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి దిగువ మూసీకి వదులుతున్న ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు గురువారం 8వ నెంబర్ క్రస్టు గేటును అడుగు మేర ఎత్తారు. ఎగువ ప్రాంతాల నుంచి 4,852.39 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా నాలుగు క్రస్టుగేట్ల ద్వారా 4,326.24 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ద్వారా ఆయకట్టుకు 314.73 క్యూసెక్కులు మొత్తం 4,640.97 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644అడుగులు (4.20టీఎంసీ)లుగా ఉంది. కాగా రెండో విడతగా కుడికాల్వకు 48.42 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 266.31 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'పులిచింతల'కు నిలకడగా వరద

పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 175అడుగులు (45.77టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 174.89అడుగులు (45.61 టీఎంసీలు)గా నమోదైంది. ఐదు రోజులుగా ఒక గేటు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 42,689 క్యూసెక్కులు వరద ప్రవాహం కొనసాగుతుండగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటును 2.5 మీటర్లు ఎత్తి 20,957 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 108 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

ప్రమాదపు అంచున ప్రయాణం



సాగర్ ఎడమకాల్వపై వేములపల్లి ఊర చెరువు సమీపంలో రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

సాగర్ ఎడమకాల్వపై నిర్మాణ సమయంలో నిర్మించిన వంతెనలు దశాబ్ధ కాలంగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రపంచబ్యాంకు నిధులతో సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టినప్పటికీ కాల్వల లైనింగ్ పనులు చేసిన అధికారులు వాటిపై ఏర్పాటు చేసిన వంతెనలను మరమ్మతులు చేయలేదు. శిథిలమై ప్రమాదకరంగా మారడంతో ప్రజలు భయాందోళనల మధ్య వాటిపై రాకపోకలు సాగిస్తున్నారు. సాగర్ ఎడమకాల్వ నిర్మాణ సమయంలో నల్లగొండ జిల్లా వేములపల్లి ఎల్-13, ఊరచెరువు సమీపంలో, అదేవిధంగా రావులపెంట శివారులోని పాలేరువాగు, మూసీల వద్ద ఈటీలపై తదితర ప్రాంతాలపై ఎడమవైపు బ్రిడ్జీలు నిర్మించారు. వంతెనల రైలింగ్‌లు దెబ్బతినడంతో పాటు రక్షణ దిమ్మెలు సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిపై నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం పొంచి ఉందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన ద్వారా రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినా కాల్వలో పడిపోయే ప్రమా దముంది. ఈ ఇరుకైన వంతెనలను ఆధునీకీకరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పరిసర రైతులు, వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో కాల్వకట్టలు బురదమయంగా మారడంతో వంతెనలు ఇరుకుగా ఉండడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎన్నెస్పీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేపట్టి రైలింగ్, రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● వేములపల్లి

అండర్ పాస్ నిండా నీరు.. వెళ్లలేక ఇబ్బంది



ఇనుపాముల వద్ద-65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్‌లో నిలిచిన వర్షపు నీటిలో నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనదారులు

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఇనుపాముల వద్ద నిర్మించిన పెడెస్టల్ అండర్ పాస్(పీయూపీ) వంతెన వర్షపు నీటితో నిండిపోయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చిన నీటికితోడు ఏఎమ్మార్పీ నీటితో నిండిన స్థానిక నల్లచెరువు అలుగునీరు అండర్‌పాసింగ్ వంతెన కింద చేరుతోంది. వర్షపు నీరు, చెరువు అలుగు నీరంతా అండర్ పాస్ వంతెన వద్ద గల డ్రైనేజీ నుంచి రహదారి అవతలి వైపునకు వెళ్లాలి. రహదారి నిర్మాణ సంస్థ డ్రైనేజీ నిర్మించినా నీరు వెళ్లేలా చేయకపోవడంతో నీరంతా అండర్ పాస్ వంతెన కింద, ఇరువైపులా సర్వీసు రోడ్లపైనే నిలుస్తోంది. దీంతో ఈ అండర్‌పాస్ వంతెన కింద నుంచి నకిరేకల్ పట్టణానికి ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించాల్సిన మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి, కొర్లపహాడ్, చీకటిగూడెం గ్రామాలతో పాటు నకిరేకల్ మండలంలోని మండలాపురం, చందుపట్ల గ్రామాలకు చెందిన వారు ఇక్కడ నుంచే వెళ్తుంటారు. ఈ క్రమంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటితో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడంతో ఆ నీటిలో నుంచే వెళ్లడం కష్టతరమవుతుందని వాహనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటిని ఒకట్రెండు రోజుల్లో తొలగించేలా రోడ్డు నిర్మించిన జీఎమ్మార్ సంస్థ చర్యలు తీసుకునేది. ప్రస్తుతం టోల్ నిర్వహణ బాధ్యతలు ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● కేతేపల్లి.

ఇంటి ఆవరణలో ఆడుకుంటూ..

నీటిసంపులో పడి చిన్నారి మృతి



భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 26: తల్లి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తన సోదరితో కలిసి ఆడుకుంటున్న చిన్నారి ఇంటి ఆవరణలో ఉన్న నీటిసంపులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో గురువారం జరిగింది. ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని రాంనగర్ కాలనీలో బీహార్ రాష్ట్రంలోని బాసుదేవ్‌పూర్ బర్ధరకోఠికి చెందిన అర్జున్ దాస్ కొంతకాలంగా భార్యాపిల్లలతో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. రోజు కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా గురువారం ఉదయం పనికోసం బయటకు వెళ్లాడు. ఇతని కుమారుడు కిరణ్‌కుమార్(13నెలలు) సాయంత్రం 4:30 గంటల సమయంలో ఇంట్లో తల్లి నిద్రిస్తున్న సమయంలో తన సోదరితో ఆడుకుంటూ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి పోయాడు. అదే ఇంటిలో అద్దెకుంటున్న మరో వ్యక్తి సంతోష్ తన పని ముగించుకుని ఇంటికిరావడంతో నీటి సంపులో తమ్ముడు పడిపోయాడని సోదరి చెప్పడంతో వెంటనే సంపులోకి చూడగా బాలుడు నీటిలో మునిగి చనిపోయి ఉన్నాడు. వెంటనే తల్లికి, పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సంఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతదేహంతో ఆందోళన



ఇంటి ఎదుట ఉంచిన మృతదేహం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26: అప్పు తీసుకున్న వ్యక్తి అసలుతో పాటు వడ్డీ చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో జరిగింది. భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన నిడిగొండ శివప్రసాద్(42) అనే చేనేత కార్మికుడు పట్టణంలో మిర్చి బండి కూడా నడిపిస్తాడు. మధ్య వర్తిగా ఉండి ఒకరికి అప్పు ఇప్పించాడు. అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీ చెల్లించకపోవడంతో కొంతకాలంగా సొంతంగా శివప్ర సాద్ నెలవారీ వడ్డీ చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంతో కుటుంబసభ్యులు అప్పు తీసుకున్న బంధువు ఇంటి ఎదుట గురువారం నిరసన తెలిపారు. వాగ్వాదం, రోదనలతో పరిసరాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొ న్నది. అప్పు తీసుకున్న బంధువు సకాలంలో వడ్డీ, అసలు చెల్లించకపోవడం, అదే సమయంలో అప్పు ఇచ్చిన మరో బంధువు వసూళ్ల కోసం తెచ్చిన ఒత్తిడితో మనస్తాపానికి గురై శివప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జరిగిన రాజీ అనంతరం శివశంకర్ మృతదేహాన్ని సొంతింటికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

పర్యాటక కల ఫలించేనా..?

● అన్నీ ఉన్నా పర్యాటక హబ్‌కు నోచని సూర్యాపేట జిల్లా ● శిథిలావస్థలో కాకతీయుల కళా వైభవం ● పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం



సూరాయపేట మండలం పిల్లలమర్రి గ్రామంలోని శివాలయం

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 26: సూర్యాపేట జిల్లాను టూరిజం కేంద్రంగా మారుస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందనే ఆశలో ప్రజలు ఉన్నారు. జిల్లాలో అనేక చారిత్రక కట్టడాలు, కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాలు, ప్రకృతి రమణీయతను తలపించే ఉండ్రుగొండ గుట్టలు ఉన్నాయి. నాగారం మండలం ఫణిగిరిలో బౌద్ధక్షేత్రం, అర్వపల్లి మండలంలోని శ్రీయోగానందలక్ష్మినర్సింహస్వామి దేవాలయం, ఖాజా నసీరోద్దీన్ బాబాదర్గా, సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలో కాకతీయుల కాలం నాటి శివాలయాలు, చివ్వెంల మండలం ఉండ్రుగొండలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో పాటు ఉండ్రుగొండ గిరిదుర్గంలో 13పురాతన దేవాలయాలు చూడ దగ్గ ప్రదేశాలుగా ఉన్నాయి. వీటన్నింటిని కలిపి ఒక టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటు చేయాలని 2021 సెప్టెంబరు 19వ తేదీన సూర్యాపేటకు విచ్చేసిన అప్పటి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ నాయకులతో పాటు ఉండ్రుగొండ దేవాలయ అభివృద్ధి కమిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆదుర్తి రామయ్య వినతిపత్రం అందజేసి, వీడియో ప్రజంటేషన్ కూడా చూపించారు. త్వరలో కేంద్ర బృందాన్ని సూర్యాపేటకు పంపిస్తానని హామీ ఇచ్చారు. సూర్యాపేట పర్యాటక కేంద్రంగా మారుతుందన్న ఆశలు చిగురించాయి. రోజులు గడిచినా ఆ దిశగా అడుగులు పడలేదు. సూర్యాపేట జిల్లాలో నాగారం మండలం ఫణిగిరి గుట్టపైన పర్యాటకుల కోసం గెస్ట్ హౌస్, చివ్వెంల మండలం ఉండ్రుగొండలో ట్రెక్కింగ్ సౌకర్యం, రోప్‌వే, రిసార్ట్ నిర్మించాలని, ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేయాలని గత ప్రభుత్వం ఆలోచన చేసినా ఆచరణలో సాధ్యం కాలేదు. ముఖ్యంగా మూసీ ప్రాజెక్టు అనుసంధానం చేసుకొని పార్కులు ఏర్పాటు కళగానే మిగిలింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ఫణిగిరి బౌద్ధక్షేత్రం అభివృద్ధి ఎప్పుడో?

నాగారం మండలం ఫణిగిరి గ్రామ సమీపంలోని ఏకశిల కొండపై ఉన్న ఫణిగిరి బౌద్ధ క్షేత్రం ఎంతో ప్రసిద్ధమైంది. టిబెట్ దేశానికి చెందిన బౌద్ధులు ఎంతోమంది తరచూ సందర్శిస్తారు. కొండపైన 16ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధ క్షేత్రానికి చెందిన ఆరామాలు ఉన్నాయి. ఫణిగిరి బౌద్ధ సంపదకు రక్షణ లేకుండా పోతోంది. తవ్వకాల్లో బయటపడిన బుద్ధుడి విగ్రహం, శాసన పిల్లర్లు ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో మ్యూజియంగా ఏర్పాటు చేస్తే బౌద్ధులు పర్యటించే అవకాశముంది. సూర్యాపేట పట్టణానికి 65వ జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో పిల్లలమర్రి గ్రామం ఉంది. ఎంతో ప్రాశస్త్యం పొందిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం లేదు.

పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం

చారిత్రక రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా(వరల్డ్ హెరిటేజ్ సైట్) యునెస్కో గుర్తించింది. కాకతీయ రాజులు అత్యంత సృజనాత్మకంగా, శిల్పకళా నైపుణ్యంతో తెలంగాణలో సృష్టించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపద దేశంలోనే ప్రత్యేక మైనది. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. అరుదైన శిల్పా కళా వైభవంతో పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్ శివాలయంలో అడుగు అడుగునా పురావస్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం శిథిలావ్యవస్థకు చేరువైంది. కంపచెట్ల మధ్యన దర్శనమిస్తోంది. భావితరాలకు ఆలయ విశిష్టతను తెలియజేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అరుదైన కాకతీయుల కళా వైభవం మరుగునపడిపోతుంది. గతంలో ఏనాడో టూరిజం హబ్ గా మార్చడం కోసం రూ. 5 కోట్ల కేటాయింపులు జరిపామని చెప్పిన అది పేపర్ల కు పరిమితం కావడంతో ఈ అద్భుత కళా సంపద మరుగున పడిపోయింది.

అసంపూర్తిగా పనులు

ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుడి వద్దకు వెళ్ళే ఘాట్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. దీనికి పురావస్తు శాఖ రూ.37 లక్షలు కేటాయించింది. రూ. 6 లక్షలతో 6 కామన్ టాయిలెట్స్ నిర్మాణం పూర్తయ్యింది. సుమారు రూ. 35 లక్షలతో నిర్మించనున్న మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో ఉంది. గుడి ఎదురుగా ఉన్న కోనేరు రివిట్‌మెంట్‌కు రూ.15 లక్షలు కేటాయించారు. దీని పనులు ప్రారంభం కాలేదు. మిషన్ భగీరథ, డ్రిస్ట్రిబ్యూషన్ ప్లాంట్ ఉండ్రుగొండ గుట్టలో ఏర్పాటు చేసి ఫిల్టర్ వేస్ట్ వాటర్‌ను గిరిదుర్గంలోకి వదిలి పచ్చధనాన్ని సంవత్సరమంతా కాపాడాలని ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. అలాగే రోప్‌వే, ఎకో-టూరిజం టెంట్స్, ఫారెస్ట్ హట్స్, ఫారెస్టు గెస్ట్‌హౌజ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన కార్యరూపం దాల్చలేదు.

రూ. 30కోట్లతో కార్యాచరణ



జిల్లాకు రూ.30కోట్లతో పర్యాటక కేంద్ర అభివృద్ధికి కార్యచరణ రూపొందిస్తున్నాం. ముఖ్యంగా ఉండ్రుగొండ, పిల్లలమర్రి దేవాలయం, ఫణిగిరి అభివృద్ధి చేస్తాం. అదేవిధంగా కోదాడ పట్టణంలోని పెద్దచెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులతో కూడిన బృందం అధ్యయనం చేసింది. జిల్లాను పర్యాటక కేంద్రంగా రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

● పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్.

ప్రతిపాదనలేనా.. రాచ'కొండ'గా మారేనా?

చౌటుప్పల్: రాచకొండ ప్రాంతం సాయుధ పోరాటానికి నిలయం. తర్వాత పీపుల్స్‌వార్ ఉద్యమానికి నిలయంగా ఉండేది. నేటి తెలంగాణకు ఒకనాడు రాజధానిగా విలసిల్లింది. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న రాచకొండ గుట్టలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రయత్నించారు. ఇక్కడ అవసరమైన ప్రభుత్వ భూమి ఉండడం.. దానికి తోడు హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఉండడంతో ఈ ప్రాంతంలో వివిధ రకాల ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. ఈ ప్రాంతంలో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాచకొండ గుట్టల్లో ఫిలిం సిటీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్‌సిటీ, ఎడ్యుకేషన్ హబ్, స్మార్ట్‌సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ లాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయి. దశాబ్ద కాలం గడిచిన నేటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా రాచకొండలో ఫిలిం సిటీ ఏర్పాటుతోపాటు పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.

రాచకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

రాచకొండ ప్రాంతం పర్యాటకానికి పెట్టింది పేరు. ఇక్కడ కొండలు గుట్టలు సెలయేర్లు పర్యాటకాన్ని తలపిస్తాయి. రేచర్ల పద్మనాయకుల కాలంలో ఇక్కడ నిర్మించిన రాచరిక కట్టడాలు నేటికీ గత వైభవాన్ని చాటి చెబుతాయి. ఇక్కడి దేవాలయాలను నిత్యం



ఎంతోమంది ప్రజలు సందర్శిస్తున్నారు. రాచకొండ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి ఈప్రాంతాన్ని సందర్శించే పర్యాటకుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలి.

● సూరపల్లి వెంకటేష్ ,రావప్ప సమితి ప్రధాన కార్యదర్శి

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

త్రిపురారం, సెప్టెంబరు 26: భూ తగాదాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని అల్వాలపాడులో గురువారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధనావత్ వెంకటేశ్వర్లు(32) తమ బంధువులతో 15సంవత్సరాలుగా భూ పంపిణీలో పంచాయితీ నడుస్తోంది. వారి వేధింపులతో మనస్తాపా నికి గురైన వెంకటేశ్వర్లు ఈ నెల 24వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన భార్య అతనిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ అదే రోజు మృతిచెందాడు. బంధువులతో చర్చల నిమిత్తం మృతదేహాన్ని రెండు రోజులు మార్చురీలో భద్రపరిచారు. వారి మధ్య రాజీ కుదరకపోవడంతో వెంకటేశ్వర్లు భార్య జ్యోతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కు చెల్లించి వస్తూ..



శైలజ మృతదేహం

మాడ్గులపల్లి, సెప్టెంబరు 26: ట్రాక్టర్ ఇంజన్‌పై నుంచి జారిపడి మహిళ మృతిచెందింది. మరో మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామ శివారులో పాలేరు వాగు వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన 20 మంది కూలీలు రెండు ట్రాక్టర్లలో మండలంలోని సుందర్‌నగర్ వద్ద ఉన్న బంగారు మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. మొక్కులు చెల్లించుకొని తిరిగి వస్తుండగా మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం పాలేరు వాగు వద్దకు రాగానే రోడ్డుకు అడ్డంగా స్పీడ్ బ్రేకర్ ఉండడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌పై ఇంజన్ పై ఉన్న దొంతగాని శైలజ(32), శేషగాని నాగమ్మ కింద పడిపోయారు. తలకు బలమైన గాయాలు కావడంతో శైలజ అక్కడికక్కడే మృతిచెందింది. నాగమ్మకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో నాగమ్మకు మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శైలజకు పాప, బాబు ఉన్నారు.

బైక్‌పై ఇంటికి వెళ్తుండగా..

కొండమల్లేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొవడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బోడ బలరాం కొండమల్లేపల్లి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పని ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బలరాం కాలికి గాయమైంది. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అమ్మ కావాలి.. అమ్మ రావాలి

● తల్లి కోసం తల్లడిల్లిన చిన్నారులు ● కాల్వలో గల్లంతైన శైలజ మృతదేహం లభ్యం ● త్రిపురారంలో విషాదఛాయలు



శైలజ మృతదేహం, తల్లికోసం రోదిస్తున్న చిన్నారులు

నిడమనూరు, సెప్టెంబరు 26: స్నానం చేయించి.. అన్నం తినిపించి.. బుజ్జగించే తల్లి కోసం ఆ ముగ్గురు చిన్నారులు గుక్క పెట్టి ఏడుస్తున్నారు. అమ్మ కావాలి.. అమ్మ రావాలి అని గుండెలవిసేలా రోదించారు. ఆ పిల్లలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. అమ్మ ఎప్పుడొస్తుందంటూ నాన్నమ్మను అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం ఆ వృద్ధురాలు నుంచి మౌనమే సమాధానమైంది. పిల్లలను పట్టుకొని ఆమె కూడా కన్నీరుమున్నీరైంది. కన్న తల్లి కోసం ఆ పిల్లలు రోదిస్తున్న తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన మేదరి శైలజ దుస్తులు ఉతికేందుకు మరో ఇద్దరితో కలిసి బుధవారం సాగర్ కాల్వకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైంది. ఆమె మృతదేహం గురువారం సాయంత్రం త్రిపురారం మండల పరిధిలోని కంపాసాగర్ బ్రిడ్జి సమీపంలో లభ్యమైంది. త్రిపురారంలోని ఇందిరమ్మ కాలనీలో జీవనం సాగించే శైలజ, జానయ్య దంపతులకు అవంతిక(12), అంజలి(10), జ్యోత్స్నప్రియ(8) వయసున్న ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు నల్లగొండలోని ఎస్సీ గురుకులంలో ఏడో తరగతి చదువుతుండగా, మిగితా ఇద్దరు త్రిపురారంలో చదువుతున్నారు. భర్త సుతారి పని చేస్తున్నాడు. భర్తకొచ్చే ఆదాయంతో ముగ్గురు పిల్లలను సాకడం కష్టం కావడంతో ఆమె కూడా భర్తకు చేదోడుగా ఉండాలనే తపనతో స్థానికంగా ఓ కూరగాయల దుకాణంలో పని చేస్తుండేది శైలజ. కానీ దుకాణం యజమానికి చెందిన దుస్తులు ఉతికేందుకు బొక్కమంతలపహడ్ వద్ద ఉన్న సాగర్ కాల్వకు వెళ్లి దుస్తులు ఉతికి పైకి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆమె ముగ్గురు కుమార్తెలు తల్లి లేని వారయ్యారు.

కంపాసాగర్ వద్ద శైలజ మృతదేహం లభ్యం

కాల్వలో ముగ్గురు గల్లంతు కాగా స్థానికులు ఓ మహిళను రక్షించగా శైలజతో పాటు సాయి నీటిలో కొట్టుకుపోయారు. పోలీసులు గజ ఈతగాళ్లతో కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు కంపాసాగర్ బ్రిడ్జి వద్ద శైలజ మృతదేహం లభ్యమైంది. సాయి కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా శైలజ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు విలపిస్తున్నారు.

నకిలీ బంగారం అంటగట్టి బురిడీ

● రూ.7లక్షల నగదు, మూడు నకిలీ బంగారు బిస్కెట్లు స్వాధీనం ● ముఠా సభ్యులను అరెస్టు చేసిన హుజూర్‌నగర్ పోలీసులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 26: నకిలీ బంగారం అంటగట్టి ప్రజలను మోసం చేసేందుకు యత్నించిన ముఠాను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మోదుగుంట్ల గ్రామానికి చెందిన నోముల ప్రకాశ్ అలియాస్ వెంకట్, నోముల మత్స్యగిరి అన్నదమ్ముళ్లు. ఆత్మకూర్(ఎం) మండలంలో ఓంసాయి ట్రేడర్స్ పేరుతో టైల్స్ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో తీవ్ర నష్టం వాటిల్లడంతో ఎలాగైనా సులువుగా డబ్బు సంపాదించాలని పల్నాడు జిల్లా రాజుపాలెంకు చెందిన కోమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డికి తెలిసిన వ్యక్తిద్వారా కలిసి రత్తయ్య, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మానపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన దేరింగుల కృష్ణవేణి, భువనగిరి-యాదాద్రి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలంలోని మోదుగుండ్లకు చెందిన నోముల ప్రకాశ్ అలియాస్ వెంకటేశ్వరరావు, నోముల వెంకట్, నోముల మత్యగిరి ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను ఎంచుకుని వారికి నకిలీ బంగారాన్ని నిజమైన బంగారంగా నమ్మించి వారికి అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో కోమెర రత్తయ్య, రేణుక పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కంసలి వారి దగ్గర నకిలీ బంగారం బిస్కెట్లను తయారు చేయించారు. ప్రకాశ్, ఈ నెల 2వ తేదీన మునగాల మండలం నారాయణగూడేనికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డితో తమ బంధువులు కొత్త ఇల్లు కట్టాలనే ఉద్దేశంతో పాత ఇల్లు కూలుస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని చెప్పారు. తక్కువ ధరకు ఇప్పిస్తానని చెప్పి వ్యాపారి వెంకటరెడ్డిని మఠంపల్లి మండలం సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లి కోమెర రత్తయ్య నుంచి నకిలీ బంగారు బిస్కెట్లు ఇస్తామని ప్రకాశ్ చిన్నపిల్లలు ఆడుకునే కాగితపు కరెన్సీ తీసుకెళ్లి, వెంకటరెడ్డి నుంచి రూ.7లక్షలు తీసుకొని అతనికి బంగారం ఇవ్వకుండా పారిపోయారు. దీనిపై ఈ నెల 3న రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటరెడ్డి మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరికొందరిని మోసం చేసేందుకు యత్నిస్తుండగా..

ముఠా సభ్యులు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెంకు చెందిన మాతంగి శ్రీను అతనికి బంగారం ఆశ చూపి హుజూర్‌నగర్‌కు రమ్మని చెప్పి శ్రీను నుంచి రూ.10వేలు తీసుకున్నారు. ఎంతకు శ్రీనుకు బంగారం ఇవ్వకపోవడంతో ఈ నెల 24న మాతంగి శ్రీను పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ రెండు విషయాలపై హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు విచారణ చేసి ఈనెల 26న నేరస్తులు జెర్రిపోతులగూడెంకు చెందిన మాతంగి శ్రీనుకు మట్టపల్లి రోడ్డులో గల భారత్ పెట్రోల్ బంక్ వద్ద డబ్బులు తీసుకుని వస్తే బంగారం ఇస్తామని చెప్పగా వారి సూచనల మేరకు గురువారం ఉదయం 11గంటలకు నోముల ప్రకాశ్, నోముల మత్స్యగిరి, మాతంగి శ్రీనులు నకిలీ బంగారంతో రాగా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. నిందితుల సమాచారంతో కోదాడ ఆర్కే లాడ్జిలో ఉన్న దేవరంగుల కృష్ణవేణి, బత్తులరేణుకలను పట్టుకున్నారు. వారి నుంచి రూ.7లక్షల నగదు, రెండు బైక్‌లు, ఆటో, 9సెల్‌ఫోన్లు, 3నకిలీ బంగారు బిస్కెట్లు, చిన్నపిల్లలు ఆడుకునే రూ.500ల 761నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

పీఎంఎంఈవోలో ఉత్తమ ప్రతిభ

● మిర్యాలగూడ టూటౌన్‌కు రెండోస్థానం ● ప్రశంసాపత్రం అందుకున్న ఎస్‌ఐ


డీజీపీ జారీ చేసిన ప్రశంసాపత్రాన్ని ఎస్‌ఐ రాంబాబుకు అందజేస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 26: పోలీస్‌శాఖలో స్టేషన్ స్థాయిలో జరిగే పిటీషన్ మేనేజ్‌మెంట్ ఎంక్వైరీ ఆఫీసర్ (పీఎంఎంఈవో) విభాగంలో మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు రాష్ట్రస్థాయిలో రెండోస్థానం దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల పనితీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి ఉత్తమ సేవా అవార్డులను అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం పిటీషన్ మెనేజ్‌మెంట్ ఎంక్వైరీ ఆఫీసర్ విభాగంలో పనితీరును గుర్తించిన డీజీపీ ర్యాంకులు కేటాయించారు. అందులో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమగ్ర విచారణ అనంతరం బాధితులకు చట్టపరంగా న్యాయం చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పీఎస్‌లను ఎంపిక చేశారు. ఈ విభాగంలో మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్ రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో ఆదిలాబాద్ వన్‌టౌన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌కు మూడోస్థానం లభించింది. మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పీఎంఎంఈవోగా వ్యవహరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ రాంబాబును డీజీపీ జితేందర్ అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా పిటీషన్ మేనేజ్‌మెంట్ విభాగంలో అత్యుత్తమ సేవలందించిన ఎస్‌ఐ రాంబాబును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. డీజీపీ కార్యాలయం నుంచి జారీ చేసిన ప్రశంసాపత్రాన్ని టూటౌన్ సీఐ నాగార్జునతో కలిసి డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఎస్‌ఐ రాంబాబుకు గురువారం అందజేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడంపై పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సేవా ప్రతిభను ఆదర్శంగా స్వీకరించి అన్ని పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు పనిచేయాలని డీఎస్పీ కోరారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి : బీజేపీ


సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 26: అర్హులైన రైతులందరికీ రుణాలను మాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రుణమాఫీ కోసం వ్యవసాయం పక్కన పెట్టి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం పట్టణంలోని 8,9వార్డుల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల హన్మంతరెడ్డి, నాయకులు బంటు సైదులు, పోరెడ్డి శ్రీను, దాసరాజు శివ, రామకృష్ణ, రమేష్, నాగరాజు, కిరణ్, విజయ్, రవిబాబు పాల్గొన్నారు.

చండూరు రూరల్: ఎన్నికల హామీ మేరకు ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. చండూరు మండలంలోని కొండాపురంలో గురువారం సామాజిక కార్యకర్త కొమ్ము గణేష్ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలుచేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు ఇరిగి రామలింగయ్య, గునగంటి లింగయ్య, ఎల్లయ్య, నర్సింహ, ఒర్సు యాదగిరి, సిల్వేరు జయమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చిట్యాల, సెప్టెంబరు 26: చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని పేదలందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. చిట్యాలలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఇచ్చిన స్థలాలను రద్దు చేసి తిరిగి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సీపీఎం, రజకసంఘం సంయుక్త ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి నాగయ్య, ఐతరాజు యాదయ్య, అరూరి శ్రీను, ఏళ్ల మారయ్య పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూరిత వాతావరణం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

హాలియా, సెప్టెంబరు 26: క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం ఏర్పడుతుందని అనుముల ఎంఈవో గుండా కృష్ణమూర్తి అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కబడ్డీ పోటీలు బాలుర విభాగంలో ప్రథమ బహుమతి తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్, రెండవ బహుమతి మైనార్టీ గురుకుల నిడమనూరు, బాలికల విభాగంలో ప్రథమ బహుమతి బీసీ గురుకుల తుమ్మడం, రెండవ బహుమతి కేజీబీవీ హాలియా పాఠశాలలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, నాయకులు షరీఫ్, జగదీష్, కోరే రమేష్, పీడీ వెంకట్‌రాంరెడ్డి, పీఈటీలు రమేష్, పరమేష్, నరేష్, రాము, చంద్రం, కోటి, సురేష్ పాల్గొన్నారు.

జీవో 25 ప్రాథమిక విద్యకు ప్రమాదకరం

కనగల్, సెప్టెంబరు 26: ప్రాథమిక పాఠశాలల ఉనికికే ప్రమాదకరమైన జీవో నెంబరు 25ను వెంటనే రద్దు చేయాలని ఎస్‌జీటీయూ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివన్‌గౌడ్ డిమాండ్ చేశారు. కనగల్‌లో గురువారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో జీవోను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక పీఎస్‌హెచ్‌ఎం పోస్టు ఉండాలని, నాణ్యమైన విద్య కోసం ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి పాఠమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా జీవో నెంబరు 25ను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాకాకుండా ప్రాథమిక పాఠశాల మనుగడను దెబ్బతీసే విధంగా ఉన్న జీవోను సవరించాలని, లేదా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వెట్టి బానిస విముక్తి కోసం దొరల గడీలను బద్దలు కొట్టిన తెలంగాణ వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ అని ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం అన్నారు. జిల్లాలో గురువారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యేలు బీఎల్‌ఆర్, వేముల వీరేశం ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మర్రిగూడ మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఐలమ్మ విగ్రహాన్ని ప్రారంభించారు. దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్ ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో రజక సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు.

తెలంగాణ వీరనారి ఐలమ్మ


మర్రిగూడలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


మునుగోడు: ఐలమ్మకు సీపీఐ నాయకుల నివాళి



నల్లగొండ : ర్యాలీ నిర్వహిస్తున్న రజక సంఘం నాయకులు




దేవరకొండలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


మిర్యాలగూడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు బీఎల్‌ఆర్, వీరేశం

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 26: దేవరకొండ నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామీణ నీటి పారుదలశాఖ, మిషన్‌భగీరథ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి తాగునీరు అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ నాగేష్, ఏఈ యువరాజు, ధనంజయ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలలో 10వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు.

డిండి పీహెచ్‌సీని 30 పడకల స్థాయికి పెంచుతాం

డిండి: జాతీయ రహదారిపై ఉన్న డిండి ప్రాథమిక వైద్యశాలను 30 పడకల ఆసుపత్రి స్థాయికి పెంచుతామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం ప్రాథమిక వైద్యశాలకు కేటాయించిన 108 వాహనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. డిండి మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో రూ.3.50 కోట్లతో సీసీరోడ్డు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. వావిల్ కోల్ గ్రామంలో పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సాయిబాబా, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, డాక్టర్ శైలి, డి.వెంకటేశ్వరరావు, రాజేష్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, ప్రసాద్, సీఎస్ శ్రీనివాస్, రాము, కలీం, దివ్య, హరిలాల్, నిక్కత్, రుక్సాన తదితరులు పాల్గొన్నారు.

● **కొండమల్లేపల్లి** మండలంలోని చెన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన మంచినీటి సరఫరా పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారంభించారు.

● **చింతపల్లి** మండలంలోని కుర్మేడ్ జడ్పీహెచ్ఎస్‌లో డివిజన్ స్థాయి ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత చేతిలో దేశభవిష్యత్తు దాగి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణ్, మాజీ ఎంపీపీ భవానిపవన్‌కుమార్, హరినాయక్, మాజీ సర్పంచ్ రుద్రమాదేవి, హెచ్ఎం అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


నాంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి

మర్రిగూడ, సెప్టెంబరు 26: రైతు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో రూ.3లక్షల నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నియోజకవర్గానికి రూ.57 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా రైతులకు రుణమాఫీ పూర్తిగా కాలేదని అన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని సూచించారు. మర్రిగూడ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు, నాంపల్లి మండల కేంద్రంలో బస్‌స్టేషన్ బైపాస్ వరకు డబుల్ రోడ్డు డివైడర్లను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాంపల్లి మాజీ జడ్పీటీసీ ఏవీరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పానగంటి వెంకన్న, నాయకులు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటంపేట బాలయ్య, అనిల్‌రెడ్డి, ఆదివాసు శ్రీనివాస్, భీమ, గోపాల్ రెడ్డి, వెంకటయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ

చండూరు: ప్రభుత్వ భూములను కాపాడటానికి ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో పలుశాఖల అధికారులతో కలిసి పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాన నీరు, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు 100ఫీట్ల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టాలని గుత్తేదారుడిని ఆదేశించారు. అనంతరం చౌరస్తాలో ఉన్న మిర్చి బండితో పాటు, కిరాణ దుకాణాల్లో విక్రయిస్తున్న మంచి నూనె ప్యాకెట్లు, పలు రకాల తిను బండారాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, కమిషనర్ మున్వర్ అలీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ వెంకన్న, నాయకులు కోడి శ్రీనివాసులు, గిరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో సమస్యల నియంత్రణకు చర్యలు



జీపీ కార్మికులకు సహాయకుడిగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

మునుగోడు, సెప్టెంబరు 26: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శాంతికుమారి తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మునుగోడు, చండూరు మండల పరిధిలోని గ్రామాల్లో మల్టీపర్పస్ కార్మికుడికి నీటి సరఫరాపై చేపట్టిన శిక్షణ గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ముజీబుద్దీన్, ఆయా మండలాల ఏఈఈలు బి.మణిదీప్, రామచంద్రయ్య, వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత: రేగట్టె


సమావేశంలో మాట్లాడుతున్న రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 26: తాను చదువుకున్న చెర్వుగట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తనవంతు చేయూతనందిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్వుగట్టులో పాఠశాలలో గురువారం నిర్వహించిన పోషణ మాసోత్సవంలో భాగంగా విద్యార్థులకు తన సొంత ఖర్చుతో యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా రేగట్టె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కామినేని మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ కోలనాల్ లూథర్, కమ్యూనిటీ మెడిసిన్ ఆఫీసర్ మారుతీశర్మ, మారుతి ప్రకాశ్, మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, సీహెచ్‌వో శ్రీరాములు, హెచ్ఎం పద్మ పాల్గొన్నారు.

మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నేడు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 26: మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నేడు నిర్వహించనున్నట్లు కమిషనర్ యూసుఫ్ తెలిపారు. చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశాని కౌన్సిల్ సభ్యులందరూ సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు. పట్టణ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలకు సంబంధించి 59 అంశాలను ఎజెండాలో పెట్టినట్లు తెలిపారు.

రేపు నల్లగొండ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

రామగిరి: మునిసిపల్ సాధారణ స్థాయి సమావేశం ఈ నెల 28వ తేదీన మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ హైమద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్‌ఏఎస్ పరీక్షలో రాష్ట్రం ముందుండాలి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 26: జాతీయస్థాయిలో నవంబరులో నిర్వహించే జాతీయ అభ్యాసన సామర్థ్య పరీక్ష (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్))లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పెద్దవూర ఎంఈవో తరి రాములు అన్నారు. సాగర్ హైలాన్ కాలనీలో శ్రీ వేమూరి అభిరామేశ్వర్‌రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు లెర్నింగ్ అవుట్ కమ్స్ పూర్తిగా వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌పీ శేషు, జీహెచ్ఎం శ్రీనివాస్, ఆర్‌పీలు దుర్గప్రసాద్, దేవేందర్, నరేందర్, నరసింహ, సీఆర్పీలు శంకర్, రమ్య, పరమేష్, సత్రం తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' నిధులను వెంటనే జమ చేయాలి

చందంపేట, సెప్టెంబరు 26: రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను వెంటనే జమ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ డిమాండ్ చేశారు. చందంపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ముగుస్తున్నా నేటి వరకు రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ పాలనకు నిదర్శనమన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ విషయంలో రైతులను అన్ని విధాలుగా మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో గోసుల శివ, తిరుపతయ్య, శ్రీశైలం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలికల గురుకులలో పురుష సిబ్బందిని తొలగించాలి

దామరచర్ల, సెప్టెంబరు 26: బాలికల గురుకుల పాఠశాలలో పురుష సిబ్బందిని తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో మోతీలాల్‌నాయక్‌కు గురువారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టు, సీఆర్‌టీ ల్యాబ్ అసిస్టెంట్ పోస్టును పురుషులకు కేటాయించడం సరికాదని, వెంటనే తొలగించాలని అన్నారు. బాలికల పాఠశాలలో మహిళ సిబ్బందిని మాత్రమే నియమించాలని నిబంధన ఉన్నా పురుష సిబ్బందిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కుర్ర సైదానాయక్, కావ్య, స్పందన, రవీందర్, రవీన్నానాయక్, సంపత్, చందు, నవీన్, నవదీప్, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన చతుర్ముఖి సాయిబాబా విగ్రహం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 26: చతుర్ముఖ సాయిబాబా విగ్రహం ప్రారంభానికి సిద్ధమైంది. చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో జాతీయ రహదారిపై బస్‌స్టేజీ సమీపంలో గల షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 28వ తేదీన శ్రీషిరిడీ సాయిబాబా జయంతి సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. విగ్రహంలో బాబా 4 ఆకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంతో పాటుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సాయి భక్తులు కె. శకుంతల, హైమా తెలిపారు. విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరాం పూలే గురుకుల కళాశాలకు ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ కుర్చీలను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదనాచారి, వైస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్, వార్డెన్ వీరయ్య, రాజ్‌కుమార్, మధుసూదన్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన గుండాల కోటేష్ అకాల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీహెచ్ఎస్ వల్లాల 2006-07 మిత్రులు బాసటగా నిలిచారు. రూ.57వేల ఆర్థిక సహాయాన్ని కోటేష్ భార్యకు అందజేశారు. నగదును పోస్టాఫీసులో వారి కమార్తె పేరుపై డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో పెరుమాండ్ల నరేష్, రమేష్, శ్రవణ్ కుమార్, మహేష్, రామలింగాచారి, అంజనేయులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని నెల్లికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29వ తేదీన ఎముకలు, కీళ్లకు సంబంధించి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నాట్కో ట్రస్ట్ ప్రతినిధి జీఎల్‌ఎన్.రావు తెలిపారు. నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వేజన ఫౌండేషన్ సహకారంతో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పేదలకు ఉచితంగా ఎక్స్‌రే, రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించనున్నట్లు తెలిపారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

త్రిపురారం: త్రిపురారం మండలంలోని కంపసాగర్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నందు ఇటీవల బదిలీల కారణంగా ఏర్పడిన ఖాళీలను తాత్కాలిక పద్ధతిన గంట ఆధారిత (హెచ్‌బీటీ) బోధన సిబ్బంది నియామకానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్లికంటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా పీజీటీ తెలుగు (తొమ్మిది, పది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు) బోధించడానికి ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 28 సాయంత్రం 4 గంటల వరకు తమ దరఖాస్తులను పాఠశాల, కళాశాలలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: అధిక ధరలకు టికెట్లు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ నందమూరి అభిమానులు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకులు వడ్డెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమా టికెట్లను ప్రభుత్వం నిర్ధారించిన ధరలకంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, రాజశేఖర్, ధర్మతేజ, శంకర్, శోభనాద్రి పాల్గొన్నారు.

హాలియా: స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా హాలియా మునిసిపాలిటీలోని శ్లోక పాఠశాలలో పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, పాఠశాల చైర్మన్ కుక్కడాల అంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంటిని, ఇంటి పరిసరాలను, స్కూల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా తడి, పొడి చెత్త వేరు చేయు విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, మేనేజర్ ఎమ్ఏ రషీద్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవికుమార్, వార్డ్ ఆఫీసర్లు సైదులు, శ్రీరాములు, ఉపాధ్యాయులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో సీపీఎం గ్రామ శాఖల మహాసభలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని గుడివాడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు మాట్లాడుతూ ప్రజల పక్షాన సమస్యల పరిష్కారానికి పోరాడేది సీపీఎం మాత్రమేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకపక్షాలను నిలదీయడంలో సీపీఎం ఎప్పుడూ ముందుంటుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రాజు, లూర్దుమారయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ ఉపాధ్యాయ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మమత కోరారు. తాత్కాలిక ప్రాతిపదికన పని చేసే ఈ పోస్టుకు దరఖాస్తు చేసే వారు ఎంఏ ఎకనామిక్స్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

దేవరకొండ, సెప్టెంబరు 26: విద్యార్థులు కష్టపడి చదివి ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి దస్రునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ, చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల మల్లయ్య, ధన్‌రాజ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, పర్వీన్, శ్రీను, పార్థసారధి, మహేందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నర్సింహ, జయప్రకాష్ నారాయణ, సత్తయ్య, దీపక్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గుల పల్లి, సెప్టెంబరు 26: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాములపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేష్, శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పాదూరి గోవర్ధని, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.